క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నుంచి కంచేటి సాయి బహిష్కరణ



సాక్షి, నరసరావుపేట : పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గానికి చెందిన కంచేటి సాయిబాబు (సాయి) పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకు ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరించారు. ఈమేరకు పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. గత కొన్నిరోజులుగా పార్టీకి స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు వ్యతిరేకంగా కంచేటి సాయిబాబు వ్యవహరిస్తుండడంతో పార్టీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

నిరుపేద కుటుంబానికి చేయూత



అచ్చంపేట: పెదకూరపాడు మండలం, ముస్లిం కుటుంబానికి చెందిన యువతి వివాహం సందర్భంగా స్థానిక బీరువా తయారీ పరిశ్రమకు చెందిన షేక్ జాని చేయుతనిచ్చారు. బుధవారం పెళ్లికూతురు తల్లిదండ్రులను అచ్చంపేటలోని తన పరిశ్రమకు ఆహ్వానించి రూ.25వేలు విలువచేసే బీరువా, డబుల్‌కాట్, కొంత ఆర్థిక సహాయం చేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆపన్నహస్తం ప్రతినిధి కమల్‌సైదా పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ అందజేత



అచ్చంపేట: మండలంలోని అంబడిపూడిలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో డిజిటల్ తరగతుల నిర్వహణకు స్నేహ హస్తాలు ఫౌండేషన్‌వారు బుధవారం 32అంగుళాల టీవీని బహుకరించారు. గ్రామ సర్పంచి కొమ్మువరపు జనవరిబాబు, పీఎంసీ చైర్మన్ కొమ్మువరపు విజయ్‌బాబు, ఉపాధ్యాయురాలు బేబీరాణి, స్నేహహస్తాలు కో–ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారి బాధ్యతలు స్వీకారం


డాక్టర్ సిరి చందన

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిణిగా డాక్టర్ ఎం.సిరిచందన బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్య అధికారి డాక్టర్ ప్రియాంక రెండునెలలు వ్యక్తిగత సెలవులపై వెళ్లడంతో సిరిచందన బాధ్యతలు చేపట్టారు. డాక్టర్ సిరిచందన పల్నాడు జిల్లా డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి డెప్యూటేషన్‌పై ఇక్కడకు వచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తానని డాక్టర్ సిరిచందన అన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


నందిగం అనీల్ కుమార్ (ఫైల్)

సత్తెనపల్లి: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. సత్తెనపల్లి మండలం గోరంట్ల గ్రామానికి చెందిన నందిగం అనీల్ కుమార్(20), నందిగం ప్రసాద్‌లు ద్విచక్ర వాహనంపై ఈ నెల 7న సత్తెనపల్లి వచ్చి తిరిగి వెళుతుండగా అబ్బూరు గ్రామంలో ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో అనీల్ కుమార్, ప్రసాద్‌లకు గాయాలయ్యాయి. అనీల్ కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న అనీల్ కుమార్ బుధవారం మృతి చెందాడు. చేతికొచ్చిన కుమారుడు మృతి చెందడంతో మృతుని తల్లిదండ్రులు మేరీ, శ్రీమాన్ కన్నీరు మున్నీరయ్యారు.

డెంగీ కేసు బాలుడుని పరీక్షించిన వైద్యాధికారులు

రాజుపాలెం: మండలంలోని కోటనెమలిపురిలో డెంగీకేసు నమోదైన ఇంటి పరిసరాలను వైద్యాధికారుల బృందం బుధవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన పి.హనుమయ్య కుమారుడు వసంతమణి అనే ఎనిమిదేళ్ల బాలుడికి ఈ నెల 7వ తేదీన జ్వరం రావడంతో ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందాడు. అయిన జ్వరం తగ్గక పోవడంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు రక్త పరీక్షలు నిర్వహించి బాలుడికి డెంగీ కేసుగా నమోదు చేశారు. ఆ సమాచారాన్ని రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తెలియపరిచారు. పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్రరత్నాకర్, ప్రాథమిక ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటకృష్ణకుమార్, సిబ్బంది కోటనెమలిపురి వెళ్లి బాలుడి పరిస్థితిని తెలుసుకునిబాలుడు ఆరోగ్యంగా ఉన్నట్లు గుర్తించారు. ఇంటి పరిసరాల్లో చుట్టూ జ్వరాల సర్వే, యాంటీ లార్వా సర్వే చేసి నమోదు చేశారు. పంచాయతీ వారి సహకారంతో సున్నం, బ్లీచింగ్‌ను చల్లించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి ప్రభాకర్‌రెడ్డి,హెల్త్ సూపర్ వైజర్లు జీవన్‌రావు, గంగాధర్, పి.లక్ష్మీ, దుర్గా, ఏఎన్ఎంలు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వడ్డెర్లు అన్ని రంగాల్లో ఎదగాలి

- మంత్రి అంబటి రాంబాబు
- ఘనంగా వడ్డే ఓబన్న జయంతి


మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: వడ్డెర కులస్తులంతా ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయ పరంగా అన్ని రంగాలలో గొప్పగా ఎదగాలని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. స్వాతంత్ర సమర యోధుడు వడ్డె ఓబన్న జయంతి వేడుకలు సత్తెనపల్లి నియోజకవర్గ వడ్డెర సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లో గల మాడా విశ్వేశ్వరయ్య కల్యాణ మంటపంలో సంఘ నాయకుడు కొమెర వీరాంజనేయులు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ వడ్డెర్లు కాయా కష్టం చేసుకుని జీవించేవారని, తమ బిడ్డలను బాగా చదివించి ఉన్నత స్థానాలకు తీసుకు వెళ్ళాల న్నారు. ఈ సందర్భంగా 2023వ సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించి వడ్డెర కులస్తులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన గుంటూరు మిర్చియార్డ్ చైర్మన్ చంద్రగిరి యేసురత్నం మాట్లాడుతూ రాష్ట్రంలోని వడ్డెర కులస్తులందరూ ఐక్యంగా వుంటూ అన్ని రంగాల్లో అగ్రగణ్యులుగా ఎదగడానికి అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. విద్యలో ఎంతో మెరుగ్గా రాణించాలని కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికయిన పల్నాడు జిల్లా వడ్డెర వెల్ఫేర్ బోర్డ్ సభ్యులు కొమెర వీరాంజనేయులు, వేముల శివ, సూరె చెంచారావు, గుంజి పద్మ, పిడుగురాళ్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లులను సత్తెనపల్లి వడ్డెర సేవా సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు తన్నీరు శ్రీను ఆధ్వర్యంలో పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ముందుగా వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకుడు చల్లా శ్రీనివాసరావు, గుంజి విజయకుమార్, వడ్డెర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బత్తుల రామస్వామి, రాజుపాలెం ఎంపీటీసీ బత్తుల సాంబశివరావు, కొమెర చంటి, బూర్సు శ్రీనివాసరావు, పల్లపు ధర్మారావు, బండారు అంకమ్మరావు, తమ్మిశెట్టి గోపి, వల్లెపు సాంబయ్య, బత్తుల కుటుంబరావు, బత్తుల రాజేష్, బత్తుల వెంకటస్వామి, మాజీ జెడ్పీటీసీ ఆలకుంట వెంకట్రావు, ఒంటిపులి నాగేశ్వరావు, వేముల కోటేశ్వరరావు, చెంబేటి నాగరాజు, వల్లెపు బ్రహ్మయ్య, నియోజక వర్గ వడ్డెర కుల పెద్దలు పాల్గొన్నారు.

వడ్డెర్లు సంఘటిత కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం..

వడ్డెర కులస్తులు సంఘటితంగా కార్యక్రమాలు చేసుకోవడం స్ఫూర్తి దాయకమని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని 24 వ వార్డులో అంకమ్మ తల్లి చెట్టు వద్ద వడ్డే ఓబన్న జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు, బీసీల ముద్దుబిడ్డ, వడ్డెర కులానికి వన్నెతెచ్చిన ఓబన్న విగ్రహావిష్కరణకు, వడ్డెర్ల అభివృద్ధికి సహకరిస్తా నన్నారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, రైతు సలహా మండలి రాష్ట్ర సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, చల్లా శ్రీనివాసరావు, సత్తెనపల్లి పట్టణ వడ్డెర సంఘం అధ్యక్షులు వేముల వరప్రసాదరావు, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామస్వామి, రాజుపాలెం ఎంపిటిసి సాంబశివరావు, న్యాయవాది చెంబేటి శివరామకృష్ణ, చల్లా పుల్లారావు, ఇర్లా నాగరాజు, పల్లపు అంకమ్మరావు, చల్లా ఆంజనేయులు, ఒంటిపులి వెంకటేశ్వర్లు, మల్లెల పాపారావు, తదితరులు ఉన్నారు.

యూరియా వాడకాన్ని తగ్గించాలి

ఏఓ అరుణ


మొక్కజొన్న సాగు పై రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ అరుణ

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): రైతులు పంటలో యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలని, అతిగా వాడకం వల్ల భూసారం దెబ్బతింటుందని మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో ల్లైస్సార్ పొలంబడి కార్యక్రమం బుధవారం జరిగింది. పంట మొదళ్ళలో యూరియా నీళ్ళు పోయడం కూలీలతో పాటుగా వ్యయప్రయాసలు ఉంటాయన్నారు. నానోయూరియా(ద్రావణం)ను పంట పై పిచికారీ చేసుకుంటే భూసారం దెబ్బతినకుండా ఉంటుందన్నారు. కూలీలతో పని లేదన్నారు. ఎకరాకు సుమారు 800 ఎమ్.ఎల్ సరిపోతుందన్నారు. అధిక మోతాదులో యూరియా వాడటం వలన సాగు వ్యయం అధికమవుతుందన్నారు. అదే నానోయూరియా పిచికారీ వలన సగానికి సగం వ్యయం తగ్గటంతో పాటుగా పంట పైనే ప్రభావం చూపుతుందన్నారు. కాంప్లెక్స్ ఎరువులు వాడకం వలన తెగుళ్ళువ్యాపించే అవకాశం ఉంటుందన్నారు. అలాగే సాగు చేసిన పంట వివరాలను తప్పనిసరిగా ఈక్రాప్ చేయించుకోవాలన్నారు. వీఏఏ శైలజ, రైతులు పాల్గొన్నారు.

నార్నెపాడులో పంటకోత ప్రయోగం

నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలో పంటకోత ప్రయోగం బుధవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన అలపర్తిమస్తాన్‌రావు పొలంలో 5''5 వైశాల్యంలో పంట కోసి నూర్పించగా 16.2 కేజీల దిగుబడి వచ్చింది. ఎకరాలకు 33బస్తాల దిగుబడి గా నమోదు చేశారు. పంట కోత ప్రయోగం ద్వారా పంట దిగుబడి అంచనా వేయవచ్చని మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ చెప్పారు. ఈ ప్రయోగాన్ని సీసీఈ యాప్‌లో డేటా అప్లోడ్ చేసి,రియల్ టైం డేటా ను జిల్లా మరియు రాష్ట్ర విభాగాలకు చేరుతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ కె.లక్ష్మీప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

శివాపురంతండాకు తాగునీటి సౌకర్యం

నకరికల్లు: తండావాసుల దాహార్తిని తీర్చేందుకు తాగునీటి బోర్లు, ట్యాంకులు ఏర్పాటు చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి తెలిపారు. మండలంలోని శివాపురం తండాలో బోర్లు ఏర్పాటు చేసేందుకు బుధవారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా పంచాయతీగా ఏర్పడిన శివాపురంతండాకు మౌలికవసతుల కల్పనకు దృష్టిసారించినట్లు తెలిపారు. జెడ్పీ నిధులు రూ.3 లక్షలు, పంచాయతీ నిధులు రూ. 3 లక్షలు వెచ్చించి సుమారు ఆరులక్షల రూపాయలతో రెండుబోర్లు, మోటార్లు, వాటర్ ట్యాంకులు, ట్యాప్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మారుమూల తండాల్లో సైతం మౌలికవసతులు కల్పించి గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ పెద్దపీట వేస్తోందని ఆయన అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్, వైస్ఎంపీపీ దూదేకుల హుస్సేబ్‌బీ బాషా, సర్పంచ్ ధ్వాళీబాయి, సక్రు నాయక్ పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్‌పై అవగాహన

క్రోసూరు: మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో జలజీవన్‌మిషన్ పై వీడబ్ల్యూఎస్‌సీ సిబ్బందికి, గ్రామస్తులకు తాగునీటి స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.శివరామయ్య, సర్పంచి చందమామ, ఉపసర్పంచి షేక్ మస్తాన్, సెక్రటరీ శరత్‌బాబు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో మండల కో–ఆర్డినేటర్ జడ సుబ్బయ్య మూడు ప్రాంతాల నుంచి తెచ్చిన తాగునీటిని పరీక్షించి ఫ్లోరైడ్, పీహెచ్ శాతం ఏవిధమైన స్థితిలో ఉన్నదో చూపించారు. అదేవిధంగా జలజీవన్ మిషన్ పథకం గురించి, నీటి స్వచ్ఛత గురించి వివరించారు. ఎఫ్‌టీకే ట్రెన్డ్ మహిళా సిబ్బంది ఐదుగురు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వామివివేకానంద 160 జయంతి


పట్టణంలో ర్యాలీ చేస్తున్న నవచైతన్య వివేకా సేవా సమితి సభ్యులు, విద్యార్థులు

సత్తెనపల్లి: చికాగో లో జరిగిన ప్రపంచ స్థాయి సర్వమత సమ్మేళనంలో తన అద్భుతమైన ప్రసంగాన్ని అందించి భారతదేశ ఔన్నత్యాన్ని చాటిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద అని నవచైతన్య వివేకా సేవా సమితి అధ్యక్షుడు నోముల వెంకట చలపతిరావు అన్నారు. నవచైతన్య వివేకా సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని కేంద్రీయ విద్యాలయం విద్యార్థులతో పట్టణంలో ప్రధాన ప్రాంతాల్లో నినాదాలు ఇస్తూ బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట చలపతిరావు మాట్లాడుతూ ఈ నెల 12న స్వామి వివేకానంద 160 జయంతి సందర్భంగా ముందుగానే ప్రజల్లో చైతన్యం కలిగించే ఉద్దేశ్యంతో ఈ ర్యాలీ ఏర్పాటు చేశామన్నారు. గురువారం ఉదయం 9.54 గంటలకు జయంతి సభా కార్యక్రమం, సేవా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో నవచైతన్య వివేకా సేవా సమితి కార్యదర్శి దివ్వెల శ్రీనివాసరావు, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ కిరణ్ రెడ్డి, నాయకులు కట్టా శంకరరావు, కొత్రప్రోలు బదరీ నారాయణ, గడ్డం శివ శంకరరావు, కొంగతి వెంకటేశ్వర్లు, విప్పర్ల పాండురంగారావు, ప్రభుదాస్, షేక్ బుడే, తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సత్తెనపల్లి: ఫిరంగిపురం సమగ్ర శిశుభివృద్ధి సేవాపథకం కార్యాలయం పరిధిలో గల సత్తెనపల్లి టౌన్, మండల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తల, సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఫిరంగిపురం సీడీపీఓ పీపీజీ ప్రసూన బుధవారం తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు సంబంధించి సత్తెనపల్లి మండలంలోని నంది గామ గ్రామంలో ఎస్టీ–1, రామకృష్ణాపురంలో ఓసి–1, గుడిపూడి ఓసి–1, సత్తెనపల్లి పట్టణంలోని 10వ వార్డు ఓసీ–1, పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామ న్నారు. అలాగే అంగన్‌వాడీ సహాయకులకు సంబంధించి భీమవరం 3 కేంద్ర పరిధిలో బీసీ–ఎ -1, నందిగామ ఎస్టీ–1, కంకణాలపల్లి గ్రామ పరిధిలోని వెన్నాదేవి ఓసి- 01, నందిగామ ఉర్దూ కేంద్ర పరిధిలో బీసీ–ఈ -1 నందు ఖాళీగా ఉన్న అంగన్వాడీ సహాయకుల పోస్టులు భర్తీ చేయడానికి నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 24 సాయంత్రం 5:00 గంట లోపు ఫిరంగి పురం సీడీపీఓ కార్యాలయం నందు తమ దరఖాస్తులు అందచేయాలన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంకొండ: రాజుపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బెల్లంకొండ సెక్టార్‌లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకురాలు పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ స్వర్ణకుమారి తెలిపారు. మండలవ్యాప్తంగా మూడు అంగన్‌వాడీ కార్యకర్తలు పోస్టు, ఒక సహాయకురాలి పోస్టు ఖాళీ అయినట్లు పేర్కొన్నారు. మండలంలోని వన్నాయపాలెం గ్రామంలోని బీసీ–1 సెంటర్‌లో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు–1, సహాయకురాలు పోస్టు -1, నాగిరెడ్డిపాలెం గ్రామంలో బీసీ కాలనీలోని సెంటర్‌లో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు -1, ఎస్టీ కాలనీలో సెంటర్‌లో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు -1 లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారుల అర్హతలు, పూర్తి వివరాల కోసం సెక్టార్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మీని సంప్రదించాలని తెలిపారు.

అంగన్‌వాడీ సహాయకరాలి పోస్టుకు దరఖాస్తు ఆహ్వానం

రాజుపాలెం: మండలంలోని మొక్కపాడు గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రం(ఓసీ)లో సహాయకురాలిగా పనిచేయుటకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ స్వర్ణకుమారి బుధవారం తెలిపారు. సహాయకురాలి పోస్టు బీసీ–డికి కేటాయించడం జరిగిందని తెలిపారు. దరఖాస్తు చేసే వారు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి, 21 ఏళ్ల నిండి 35 ఏళ్లలోపు వారై ఉండాలి. వివాహితురాలై ఉండాలి. తప్పని సరిగా కులం ధృవీకరణ పత్రాన్ని జత చేయాలి.ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను రాజుపాలెం సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

కన్యకా పరమేశ్వరికి సారె బహూకరణ


అమ్మవారికి సారెను తీసుకెళుతున్న భక్తులు

పెదకూరపాడు: స్థానిక త్రిశక్తి పీఠంలో వేంచేసియున్న కన్యకా పరమేశ్వరి అమ్మవారికి భక్తులకు బుధవారం సారె బహూకరించారు. ఈనెల 14వ తేదీన గోదాదేవి కల్యాణ మహోత్సవంలో భాగంగా అమ్మవారికి ఆర్యవైశ్య సంఘ మహిళలు, భక్తులు సారెను తీసుకెళ్లారు. మంగళవాయిద్యాల నడుమ అమ్మవారికి సారెను బహూకరించారు.

గణపవరంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



రాజుపాలెం: మండలంలోని గణపవరం గ్రామ సచివాలయం–1 పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ రవితేజ నాయక్ 47 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అందులో 31 మందికి బీపీ మందులు, 13 మందికి షుగర్‌కు సంబంధించిన మందులను నెలకు సరిపడ అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి, మండల పరిషత్ పాఠశాలకు వెళ్లి పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇంటింటా తిరిగి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో శస్త్ర చికిత్స చేసి కాన్పు అయిన బాలింతల వద్దకు వెళ్లి తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. దీర్ఘవ్యాధులు ఉన్న వారి ఇంటి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సీవీ రమణ, ఎమ్ఎల్‌హెచ్ పి.శిరీషాభాయి, ఏఎన్ఎం ధనలక్ష్మీ, చెవుల పూర్ణచంద్రరావు, ఆశ కార్యకర్తలు అనురాధ, సంతోషం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు


వడ్డవల్లిలో ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

సత్తెనపల్లి: ధనుర్మాసంలో భాగంగా పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం, వడ్డవల్లి శ్రీ రామాలయం, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వడ్డవల్లిలో 27వ రోజును పరస్కరించుకుని 27 గ్లాసులు పొంగళ్లతో కైదారై నివేదించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వడ్డవల్లి శ్రీ రామాలయం, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం ఉదయం 9 గంటలకు సుదర్శన హోమం, 12 గంటలకు పూర్ణాహుతి చేపట్టనున్నారు.

సంక్రాంతి సంబరాలు


పట్టణంలోని ప్రగతిలో విద్యార్థినిల కోలాటప్రదర్శన


మేళతాళాల నడుమ గంగిరెద్దు, హరిదాసుల వేషధారణతో అలరిస్తున్న విద్యార్థులు

నకరికల్లు: సంస్కృతి..సాంప్రదాయాలు ప్రతిబింబించేలా ..భావితరాలకు అలనాటి పండుగల ప్రాధాన్యతను తెలిపేవిధంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని దేచవరం ఆదర్శపాఠశాల, చల్లగుండ్ల, గుండ్లపల్లి ఉన్నతపాఠశాలలు, స్థానిక ఎంపీపీ మెయిన్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దారు. గొబ్బెమ్మలు, భోగిమంటలు, మేళతాళాలు, గంగిరెద్దు, హరిదాసులు, కనుమ ముగ్గులతో సంక్రాంతి పండుగ ముందుగానే వచ్చేసిందా అన్నట్లు వేడుకలు జరిపించారు. విద్యార్థినీ, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులను ధరించి అలరించారు. ఆదర్శపాఠశాలలోని విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. సాంప్రదాయబద్ధంగా ఉమ్మడి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు తెలుగువారి ఆచార సాంప్రదాయాలు అద్దం పట్టాయని అభినందించారు. కార్యక్రమంలో ఆదర్శపాఠశాల ప్రిన్సిపల్ వేళాంగిణి మేరీ, ప్రధానోపాధ్యాయులు వి.వెంకట్రావు, జాకబ్, మేదరమెట్ల స్వామి, నాయకులు దొండేటి కోటిరెడ్డి, భవనం రమణారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

క్రోసూరు: పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ముగ్గులు పోటీలు, ఆటలు పోటీలు నిర్వహించారు. మండలంలోని అందుకూరు ఎంపీపీఎస్ పాఠశాల, క్రోసూరు సిమ్స్ పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. అందుకూరు ఎంపీపీఎస్ పాఠశాల ముగ్గుల పోటీలకు ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచి జంగా సౌభాగ్యలక్ష్మీ పాల్గొన్నారు. పాఠశాల హెచ్ఎం కృష్ణంరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సిమ్స్ పాఠశాల ముగ్గుల పోటీల్లో పాఠశాల డైరెక్టర్ గోవర్ధనరావు, పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాలయాల్లో .. సంక్రాంతి సంబరాలు

సత్తెనపల్లి: అందమైన మగువ ఆకారంలో గీసిన ముగ్గులు ..సంక్రాంతి లక్ష్మీకి పూజలు .. భోగి మంటలు .. కోడి పందాలు.. సంప్రదాయ నృత్య ప్రదర్శనలు .. ఎక్కడ చూసినా పండుగ వాతావరణం, పట్టు వస్త్రాలతో హాజరైన విద్యార్థినులు విద్యాలయాల్లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో సందడి చేశారు. పట్టణంలోని ప్రగతి సీబీఎస్ఇ పాఠశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ మక్కెన అచ్చయ్య మాట్లాడుతూ అన్నదాత అయినటువంటి రైతులకు సంక్రాంతి పండుగ ఎంతో ముఖ్యమైనదన్నారు. ఆరుగాలం కష్టించి పనిచేసిన రైతులు పండించిన పంటను చూసి వారి కళ్ళల్లో ఆనందం వెల్లి విరుస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సంప్రదాయ నృత్యాలు అలరించాయి. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే భోగి మంటలు, కోడిపందాలు విద్యార్థులను ఎంతగానో ఆకర్షించాయి. విద్యార్థులు గాలి పటాలను ఎగురవేసి ఆనందం వ్యక్తం చేశారు. కరస్పాండెంట్ మక్కెన పద్మజ హరిదాసుడికి దక్షిణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షేక్ మస్తాన్ వలి, ఉపాధ్యాయులు శ్రీకాంత్, పద్మశ్రీ, చెన్నకేశవ, షఫీ, హసీనా, మల్లేశ్వరి, స్వప్న, మక్కెన శ్రీనివాసరావు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

భట్లూరు ఎంపీపీఎస్, డీపీఈపీ పాఠశాలల్లో..

సత్తెనపల్లి మండలం భట్లూరు గ్రామంలోని ఎంపీపీఎస్, డీపీఈపీ పాఠశాలల ఆధ్వర్యంలో ఎంపీపీఎస్ మెయిన్ భట్లూరు పాఠశాల ఆవరణలో సంక్రాంతి సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ విశేషాలు, సంస్కృతి సంప్రదాయాలు విద్యార్థులకు తెలియచేసేలా హరిదాసు, గంగిరెద్దులు, కోలాటం, రైతు, పల్లెటూరి పడుచుల వేషధారణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భోగి మంటలు వేసి, విద్యార్థులకు పాఠశాల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వ హించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సెక్రటరీ సిహెచ్ కృష్ణ ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.ప్రేమ్ కుమార్, టి థెరిస్సా, ఉపాధ్యాయులు షేక్ మహబూబ్ సుభాని, సిహెచ్ శ్రీదేవి, వెల్ఫేర్ అసిస్టెంట్ గోపి, అంగన్‌వాడీ కార్యకర్తలు మేరీ, సుస్మిత, ఎస్ఎంసి కమిటీ మెంబర్లు, తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

పెదకూరపాడు: మండలంలోని తమ్మవరం గ్రామంలో మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మాగులూరి భాను ప్రకాష్ నిరుపేదలకు దుప్పట్లు బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడిని ఆదుకోవాలనే దృక్పథంలో మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.